బీమా ప్రీమియం.. రైతన్నకు పెనుభారం

- ఏడాదికే రెట్టింపు చేసిన కూటమి ప్రభుత్వం
- బీమా చెల్లింపు సగానికి కుదింపు
- నాడు ప్రీమియం మొత్తం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లింపు
- ప్రస్తుతం పంటల బీమాకు దూరమవుతున్న రైతులు

కూటమి ప్రభుత్వం అన్నదాతపై బీమా ప్రీమియం పేరిట పెనుభారం మోపింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రీమియం అంతకంత పెంచేసింది. పైగా పంట నష్టపోతే చెల్లించే బీమాను కూడా సగానికి కుదించేసింది. ఎక్కువ పొలమున్న రైతులైతే ప్రీమియం చెల్లించలేక పంట బీమాకు దూరమవుతున్నారు.


సాగులో ఉన్న వరి పంట

కొడవలూరు: అన్నదాతను కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియం రూపంలో వెన్ను విరిచింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది ఎకరా వరికి రూ.420లు బీమా ప్రీమియం ఉండగా, ఈ ఏడాది ఎకరాకు రూ.840లు చేసింది. ఇలా ఏడాదిలోనే వంద శాతం పెంచింది. పైగా పంట నష్టం వాటిల్లితే వచ్చే బీమా మొత్తాన్ని సైతం అమాంతం కుదించేసింది. గతేడాది ఎకరాకు రూ.1.05 లక్ష బీమా చెల్లించేలా ఉండగా ఇప్పుడు కేవలం రూ.42 వేలు మాత్రమే చెల్లించేలా చర్యలు తీసుకొంది. పదెకరాలున్న రైతు పంట బీమా చేయాలంటే రూ.8,400లు చెల్లించాలి. ఇరవై ఎకరాలకైతే రూ.16,800లు చెల్లించాలి. ఇంత మొత్తం చెల్లించడం రైతులకు పెనుభారంగా మారింది. ధాన్యం ధరలు దయనీయంగా ఉంటుండడం, సాగు ఖర్చులు పెరిగిపోవడంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ఈ పరిస్థితుల్లోనే బీమా ప్రీమియం రెట్టింపు చేయడంతో రైతులు పంటల బీమాకు దూరమవుతున్నారు.

కౌలు రైతుల పరిస్థితి దయనీయం

ప్రస్తుత ప్రభుత్వంలో కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. భూ యజమానికి కౌలు చెల్లించడంతోపాటు సాగు ఖర్చులు కూడా భరించాలి. ఆ మేరకు ధాన్యం ధరలు పెరుగుతున్నాయా అంటే అదీ లేదు. ఫలితంగా కౌలు రైతులు నష్టాలు చవిచూస్తూ తల్లడిల్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో బీమా ప్రీమియం పిడుగు పడడంతో పంట బీమా జోలి కెళ్లాలంటే భయపడిపోతున్నారు. ఒక వేళ విపత్తులు సంభవించి పంట నష్టం వాటిల్లితే వీరి పరిస్థితేమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

గత ప్రభుత్వంలో దర్జాగా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లు రైతులకు ఉచిత పంటల బీమా సౌకర్యం కల్పించింది. రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించేది. పైగా పంట నష్టపోయిన రైతులకు సకాలంలో బీమా మొత్తం చెల్లించింది. పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.13,500లు క్రమం తప్పకుండా ఇస్తూ రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రీమియం భారం మోపడంతో పాటు పెట్టుబడి సాయానికి మొదటి ఏడాది నామం పెట్టింది. రెండో ఏడాది తొలి పంట సమయానికి పెట్టుబడి సాయమందించకపోగా రెండో పంట పూర్తవుతున్న తరుణంలో ఇస్తామని ప్రకటించింది. అదీ ఇప్పటివరకు అతీగతీ లేదు. దీంతో అన్నదాతల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

బీమాను వదులుకోవాల్సిందే



ప్రస్తుత పరిస్థితుల్లో రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. బీమా ప్రీమియం చెల్లించడమే భారమైతే దానిని రెట్టింపు చేయడం పెనుభారమే. అందువల్లే పంట బీమాను వదులుకోవాల్సి వస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతుపై పైసా ప్రీమియం భారం పడకుండా ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. కూటమి ప్రభుత్వం రైతులపై సవతి ప్రేమ చూపుతోంది. మాటలు చెప్పి రైతులను నిలువునా ముంచుతోంది.

– దేవనబోయిన శివకుమార్, రైతు, రేగడిచెలిక, కొడవలూరు మండలం

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి



ధాన్యం ధరలు అమాంతం పతనమై రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులపై ప్రభుత్వం ప్రీమియం భారం మోపడం దారుణం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచింది. కూటమి ప్రభుత్వం కూడా రైతులకు ప్రీమియం భారం లేకుండా చూడడంతోపాటు పెట్టుబడి సాయమందించాలి. లేనిపక్షంలో కూటమి ప్రభుత్వం రైతుల ఆగ్రహానికి గురి కావల్సి ఉంటుంది.

– కలిశెట్టి వెంకయ్య, రైతు, తలమంచి, కొడవలూరు మండలం

వేరుశనగ రైతుల పరిస్థితి అంతే


సాగులో ఉన్న వేరుశనగ పంట

జిల్లా వ్యాప్తంగా వేరుశనగ సాగు కూడా గణనీయంగా ఉంది. ఈ రైతుల పరిస్థితి కూడా అదేలా మారింది. గతేడాది ఎకరాకు ప్రీమియం రూ.150లు ఉండగా ఈ ఏడాది ఎకరాకు రూ.280లకు పెంచేశారు. నష్టం వాటిల్లితే చెల్లించే బీమా మొత్తం గతేడాది రూ.75 వేలు ఉండగా, ఇప్పుడు రూ.28 వేలకు కుదించేశారు. దీని వల్ల వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సింహభాగం వేరుశనగ రైతులు పంట బీమాకు దూరమవుతున్నారు.

మోడేగుంట సర్పంచ్‌కు ప్రసన్న పరామర్శ



కోవూరు: మండలంలోని మోడేగుంట సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడూరు వెంకటరమణారెడ్డి అనారోగ్యానికి గురై నెల్లూరులోని అమృత హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం హాస్పిటల్‌కు చేరుకుని పరామర్శించారు. వెంకటరమణారెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం అందించాలంటూ వైద్యులను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాధాకృష్ణారెడ్డి, బాలశంకర్‌రెడ్డి, కోవూరు మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ

పొదలకూరు: పర్యావరణ పరిరక్షణ, వనమహోత్సవంపై పట్టణంలో బుధవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదామంటూ నినాదాలు చేశారు. మొక్కలను చేత పట్టుకుని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేశారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పొదలకూరు: మండలంలోని విరువూరు ప్రగతినగర్‌కు చెందిన బాలిక గత నెల 26వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. ఇంటర్ ఫెయిల్ కావడంతో బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లి గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

రాజకీయ క్రీడలో రాష్ట్రాన్ని బలి చేయొద్దు

నెల్లూరు రూరల్: తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ క్రీడలో ఆంధ్రాను బలి చేయొద్దని బీజేపీ నేత మిడతల రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. గోదావరి జలాలపై అభ్యంతరం తెలిపే హక్కు తెలంగాణకు లేదన్నారు. కాసా శ్రీనివాసులు, బుధవరపు బాలాజీ, నరాల సుబ్బారెడ్డి, నీలిశెట్టి లక్ష్మణరావు, సోమా గోపాల్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి హోమ సప్తాహ మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శంకరమఠంలో కామ్య హోమ సప్తాహ మహోత్సవాలను శుక్రవారం నుంచి ఈ నెల పది వరకు నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు కొండ్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమాలు, పారాయణం, సౌందర్యలహరి ప్రవచనలను నిర్వహించనున్నామని వివరించారు.

సహకార దినోత్సవాన్ని నిర్వహించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో కార్యక్రమాలను చేపట్టాలని డీసీఓ గుర్రప్ప ఆదేశించారు. నగరంలోని డీసీఓ కార్యాలయం నుంచి సహకారాధికారులు, సహకార సంఘాల సీఈఓలతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పలు కార్యక్రమాలను ఈ నెల ఆరు వరకు నిర్వహించాలని సూచించారు. సహకార పతాకాలను శనివారం ఆవిష్కరించి.. ప్రతిజ్ఞలు చేయించడంతో పాటు అవగాహన ర్యాలీలను జరపాలని ఆదేశించారు. డీసీఏఓ తిరుపాల్‌రెడ్డి, కావలి, కందుకూరు డివిజనల్ సహకార శాఖ అధికారులు రాజశేఖర్, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రివ్యూల పేరిట నగదు కొల్లగొట్టి..

నెల్లూరు సిటీ: హోటళ్లకు రివ్యూలిచ్చి.. ఆన్‌లైన్ ద్వారా నగదు సంపాదించొచ్చంటూ రూ.2.34 లక్షలను సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. దీనిపై వేదాయపాళెం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. వివరాలు.. తెలుగుగంగ కాలనీలో నివాసం ఉంటున్న మహేంద్రబాబు కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. పార్ట్ టైమ్ జాబ్ పేరిట టెలిగ్రామ్ ద్వారా యాకర్ అనే గ్రూప్‌లో గతేడాది నవంబర్ 20న చేర్పించారు. హోటళ్లకు రివ్యూలు రాయాలని, దీనికి కమీషన్లను ఇస్తామని నమ్మబలికారు. దీంతో నాలుగు దఫాలుగా రూ.2.15 లక్షలను డిపాజిట్ చేయించుకున్నారు. అయితే నగదు విత్‌డ్రా కాకపోవడంతో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరిగి డబ్బులిస్తామంటూ రూ.18,215ను డిపాజిట్ చేయాలని సూచించడంతో ఆ మేరకు జమ చేశారు. చివరికి తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో బెదిరించి.. ఫోన్‌పేలో డబ్బులేయించుకొని..

నెల్లూరు సిటీ: కత్తితో ఇద్దరు వ్యక్తులు బెదిరించి ఫోన్‌పేలో డబ్బులేయించుకున్నారంటూ వేదాయపాళెం పోలీసులకు బాధితుడు బుధవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. హరికృష్ణనగర్‌లోని వైష్ణవీ హోమ్ అపార్ట్‌మెంట్‌లో గల ఓ బొటిక్ సెంటర్‌లో ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన అన్సర్ ఏడేళ్లుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో వనంతోపు సెంటర్‌లోని ఓ వీధిలో రోడ్డు పక్కన గత నెల 25న ఉండగా, ఇద్దరు వ్యక్తులు కత్తితో బెదిరించి రూ.వెయ్యి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వద్ద లేవని, ఫోన్‌పేలో ఉన్నాయని చెప్పడంతో వారి నంబర్‌కు ఈ మొత్తాన్ని వేయించుకున్నారు. నిందితుల మాటల బట్టి వారి పేర్లు రిక్సేన్, గోవర్ధన్ అని తెలిసిందని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్లో చోరీ

నెల్లూరు సిటీ: హోటల్లో గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నగరంలోని మెక్లిన్స్‌రోడ్డుకు చెందిన జొహైబ్ హుస్సేన్.. వహాబ్‌పేటలో పరివార్ ప్యారడైజ్ హోటల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో హోటల్‌ను మంగళవారం మూసేసి ఇంటికెళ్లారు. హోటల్ వెనుక గ్రిల్స్‌ను తొలగించి లోపలికి దుండగులు ప్రవేశించిన అంశాన్ని బుధవారం వచ్చిన ఆయన గుర్తించారు. క్యాష్ కౌంటర్‌లోని రూ.4200ను చోరీ చేయగా, ఎనిమిది సీసీ కెమెరాలు.. నాలుగు టేబుల్ లాకర్లను ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం

నెల్లూరు(బృందావనం): మిలటరీ కాలనీలోని సాల్వేషన్ ఆర్మీ – ఐసీటీ విలియమ్ బూత్ కోర్ప్స్‌లో సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జోసఫ్, సుశీల హాజరయ్యారు. తొలుత వ్యవస్థాపకులు విలియమ్, కేథిరిన్ చిత్రపటాలకు పుష్పాంజలిని సమర్పించి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం చీరలు, దుప్పట్లు, లుంగీలు తదితరాలను పంపిణీ చేశారు. దాస్, కిశోర్, విజయబాబు, వినీత్, గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి


అలగానిపాడు పాఠశాల ఆవరణలో నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు

విడవలూరు: ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి వారిని రిలీవ్ చేయాలని బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ అన్నారు. మండలంలోని విడవలూరు, ఊటుకూరు కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో రెండో రోజు బీటీఏ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఉపాధ్యాయులను ఇంకా రిలీవ్ చేయలేదని, దీనిపై వారికి ప్రత్యామ్నాయ చర్యలు చూపి తర్వాత రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం బీటీఏలో చేరిన పలువురు ఉపాధ్యాయులను జిల్లా గౌరవాధ్యక్షుడు పి.చిన్నయ్య అభినందించారు. అనంతరం మండలాధ్యక్షులు ఎస్.కిశోర్, కె.శంకరయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సామాజికంగా, సర్వీస్ పరంగా ఏ సమస్యలు వచ్చినా బీటీఏ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వై.చెంచుకృష్ణయ్య, ఎస్.బాలసుబ్రహ్మణ్యం, యు.వెంకటరావు, జి.గణపతి, ఆర్.మల్లికార్జునరావు, పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వరిలో ఆకునల్లిని నివారించుకోండి


కొడవలూరు: గండవరంలో..

కొడవలూరు: వరి పంటను ఆకునల్లి తెగులు ఆశించి ఉన్నందున నివారించుకోవాలని ఏఓ ఎస్.విజయలక్ష్మి సూచించారు. మండలంలోని గండవరం, గౌతమ్ నగర్‌లలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గండవరంలో ఆమె మాట్లాడుతూ ఆకునల్లి నివారణకు రెండు మిల్లీలీటర్ల ప్రొఫెనోఫాస్ మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా నివారించుకోవాలన్నారు. లేనిపక్షంలో ఒక మిల్లీలీటర్ స్పైరోమెసిఫెన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా నివారించుకోవాలని చెప్పారు. కౌలు రైతులు సీసీఆర్ కార్డులు విధిగా చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏ టి.కవిత, రైతులు జగన్‌మోహన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఊటుకూరులో..

విడవలూరు: మండలంలోని ఊటుకూరు గ్రామ రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి లక్ష్మి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరు శనగ పంటల్లో లింగాకర్షక బుట్టల ఆవశ్యకతను వివరించారు. అనంతరం గ్రామంలోని పలువురి వేరుశనగ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ప్రవీణ్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులతో లాభాలు

మనుబోలు: శాస్త్రీయ పద్ధతులతో వ్యవసాయం చేస్తే అధిక లాభాలు గడించవచ్చని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య అన్నారు. మండలంలోని వెంకన్నపాళెం, మడమనూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు జరిపించుకుని భూమి స్వభావానికి అనుకూలమైన పంటలను సాగు చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలని, వాటి స్థానంలో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

లేగుంటపాడు, పడుగుపాడు గ్రామాల్లో..

కోవూరు: మండలంలోని లేగుంటపాడు, పడుగుపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. మండల ఏఓ టి.రజని రైతులకు పలు సూచనలు చేశారు. పంటల బీమా ప్రాముఖ్యతను వివరించారు. తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. ఎరువులు, నీటి యాజమాన్యంపై అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏలు శ్వేతలేఖ, సుభాషిని, స్థానిక రైతులు పాల్గొన్నారు.


విడవలూరు: ఊటుకూరులో..


మనుబోలు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వెంకటకృష్ణయ్య


కోవూరు మండలంలో..

అడుగడుగునా సమస్యల స్వాగతం


ఆరో వార్డు ఖాజానగర్ మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 6, 17వ వార్డుల్లో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి అనేక సమస్యలు స్వాగతం పలికాయి. ముందుగా ఎంపిక చేసిన టీడీపీ అభిమానుల ఇళ్లకు వారు వెళ్లి ప్రభుత్వ పాలన ఎలా ఉంది.. సంక్షేమ పథకాలు అందాయా.. అంటూ సాగారు. అయినప్పటికీ కొంతమంది స్వచ్ఛందంగా ఎమ్మెల్యే, ఎంపీ దగ్గరకు వచ్చి పలు సమస్యలు మొర పెట్టుకున్నారు. తమకు ఇళ్లు కావాలని, నివాస స్థలం మంజూరు చేయాలని, పింఛన్ అందడం లేదని, తల్లికి వందనం రావడం లేదని వాపోయారు. ఆరో వార్డు ఖాజానగర్‌లో ఎంపీ, ఎమ్మెల్యే వస్తున్నారని తెలిసినా డ్రెయినేజీ కాలువల్లో కనీసం మురుగు కూడా తొలగించలేదు. కాలువల్లో పైపైన సున్నం చల్లి మమ అనిపించారు. దీంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కాగా 6, 17 వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, నాయకులు రాకపోగా వార్డుతో సంబంధంలేని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం గమనార్హం.

నేత్రపర్వంగా సుభద్ర కల్యాణం





నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా చప్పరోత్సవం, సుభద్ర కల్యాణోత్సవాన్ని కనులపండువగా బుధవారం జరిపారు. ఉభయకర్తలుగా ఉగ్గుమూడి భాస్కర్, సృజన్, శ్రావణి, తీర్థ, తిరువత్తూరు అభిమన్యు, సత్యవతి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈఓ జానకి పర్యవేక్షించారు.

ఈకేవైసీ పూర్తి చేయాలి


ఆర్ఎస్‌కేలో జాబితాను ప్రకటిస్తున్న అధికారులు

పొదలకూరు: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన వారు ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని ఏఓ ప్రతాప్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యాక్రమంలో భాగంగా బుధవారం ఆర్‌వై పాళెం, మొగళ్లూరు గ్రామాల్లో రైతులతో ఏఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌కేల్లో పథకానికి సంబంధించిన అర్హులైన రైతుల జాబితాను ప్రకటించారు. అర్హులై ఉండి ఈకేవైసీ చేయించుకోని రైతులు కేంద్రాలకు వెళ్లాలన్నారు. అక్కడి సిబ్బంది ద్వారా ఈకేవైసీ చేయించుకోవాల్సిందిగా పేర్కొన్నారు. వారికి మాత్రమే పథకానికి సంబంధించిన నగదు బ్యాంకులో జమవుతుందన్నారు. అనంతరం గ్రామాల్లో నిమ్మ పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు గోవర్ధన్, దీప పాల్గొన్నారు.

కాకాణి పూజిత పరామర్శ


బుజ్జమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాకాణి పూజిత

వెంకటాచలం: మండలంలోని చవటపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చనుమూరు వెంకటేశ్వర్లును మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత బుధవారం పరామర్శించారు. వెంకటేశ్వర్లు సతీమణి బుజ్జమ్మ దశదిన కర్మక్రియల్లో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'సుపరిపాలన'పై చిత్తశుద్ధి ఏదీ?

విడవలూరు: కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి 'సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం'పై చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించారు. సమయపాలన లేకుండా గంటన్నర ఆలస్యంగా హాజరు కావడంతో గ్రామస్తులు, సొంత పార్టీ కార్యకర్తలు కూడా అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పాతూరు, రామతీర్థం గ్రామాల్లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం పర్యటించాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 10:30కి పాతూరు గ్రామానికి, 11 గంటలకు రామతీర్థం గ్రామానికి హాజరు కావాల్సి ఉంది. కానీ పాతూరుకు ఉదయం 12 గంటలకు రామతీర్థానికి మధ్యాహ్నం 1:30కి రావడంతో అటు ప్రజలు, పార్టీ కార్యకర్తలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

పార్టీ సానుభూతిపరుల ఇళ్లకే..

పాతూరు గ్రామంలో దాదాపు 300 గృహాలు ఉండగా, రామతీర్థం గ్రామంలో దాదాపు ఐదు వేల గృహాలు ఉన్నాయి. ఎమ్మెల్యే తన పర్యటన నేపథ్యంలో స్థానిక నాయకులు ముందుగానే ఎన్నిక చేసుకున్న కొన్ని టీడీపీ సానుభూతిపరుల గృహాలను మాత్రమే సందర్శించారు. దీంతో గ్రామంలోని పలువురు వ్యక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఎమ్మెల్యే తమ గ్రామాలకు ఎవరికీ ఎలాంటి సమాచారం లేకుండా వారికి నచ్చిన వ్యక్తుల ఇళ్లకు మాత్రమే ఆమెను తీసుకెళ్తే తమ సమస్యలు ఎలా చెప్పాలి అంటూ పలువురు గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే పర్యటనపై ముందుగా తెలియజేస్తే తమ సమస్యలు చెప్పుకునే అవకాశం ఉంటుందని వారు వాపోయారు.